సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 22 । జనవరి । 2023



10శాతం నిధులు కేటాయించాలి

విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పదిశాతం నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో



టీఆర్ఎస్‌పై వ్యతిరేకతతోనే బీఆర్ఎస్‌గా..

టీఆర్ఎస్‌పై వ్యతిరేకత రావడంతోనే బీఆర్ఎస్‌గా మార్చారని కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
31.0°/17.0°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడి మామూలుగా ఉంటుంది. రాత్రి పొగమంచు కారణంగా చలి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఏఈఈ పరీక్ష

- హాజరుకానున్న అభ్యర్థులు 81,571
- రెండు సెషన్లలో నిర్వహణ

హన్మకొండ అర్బన్: టీఎస్‌పీఎస్సీ ద్వారా ఆదివారం జరగనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10నుంచి 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30నుంచి 5గంటల వరకు రెండవ సెషన్ ఉంటుంది. మొత్తం 81,571 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో 19 పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రారంభానికి 15నిమిషాల ముందు కేంద్రాల గేట్లు మూసివేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఆలోగా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్‌తోపాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీకార్డు, బ్యాంక్ పాస్‌బుక్ వంటి గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి తెచ్చుకోవాలని సూచించారు.

గ్రూప్-1 మెయిన్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కందాల శంకరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీలోపు హనుమకొండ లష్కర్ బజార్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 0870-2571192 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీడీయూ పరీక్ష ఫలితాలు విడుదల



నయీంనగర్: నవంబర్‌లో నిర్వహించిన ఇంజనీరింగ్, ఫార్మసీ 3వ సెమిస్టర్, యూజీ 3, 5 సెమిస్టర్ల ఫలితాల్ని హనుమకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బి (సీడీయూ) యూనివర్సిటీ కులపతి పురుషోత్తంరెడ్డి శనివారం విడుదల చేశారు. యూజీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో 69.3 శాతం ఇంజనీరింగ్, ఫార్మసీ 3 సెమిస్టర్ పరీక్షల్లో 67.9 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీ జి.దామోదర్, రిజిస్ట్రార్ ఎం.రవీందర్, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఓఈ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్, మడికొండ బాలికల సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరీ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23లో పదోతరగతి పాస్ అయిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జనవరి 12 నుంచి జనవరి 31 సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీఓఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. ఈకళాశాలలో ఐఐటీ, ఎన్ఐటీ, ఎన్ఈఈటీ మొదలగు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, వసతి కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు www.tswreis.ac.in, www.tswreisjc.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

'ఆయుష్మాన్ భారత్'లో మొదటి ఓపెన్ హార్ట్ సర్జరీ

ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మొట్టమొదటి సారిగా ఆయుష్మాన్ భారత్‌కింద ఓపెన్‌హార్ట్ సర్జరీ నిర్వహించినట్లు ఆస్పత్రి నోడల్ అధికారి డాక్టర్ గోపాల్‌రావు శనివారం తెలిపారు. మహారాష్ట్రకు చెందిన 32 సంవత్సరాల వయస్సు గల సోనారి యేసయ్యకు డాక్టర్ సృజన్ సమక్షంలో కార్డియో కానాల్ ఆపరేషన్ చేసినట్లు చెప్పారు.

అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల ఎంపిక



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, వరంగల్, జనగామ, మహబూబాబాద్ రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ రైల్వే స్టేషన్లుగా ఎంపికైనట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్స్ అభివృద్ధి పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని నాలుగు రైల్వే స్టేషన్లను ఎంపిక చేసినట్లు అధికారులు చెప్పారు. టెండర్లు కూడా పిలిచినట్లు తెలిపారు. ఎంపికైన స్టేషన్లలో ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ, ఇతరసౌకర్యాలు కల్పించనున్నారు.

నటరాజ వందనం.. శివుడికే అంకితం



మల్లికా సారాభాయ్ నృత్య భంగిమ

అమ్మ రాసిన పుస్తకంలోంచి నృత్య రూపకం రూపొందించా..

- రామప్పలో ప్రదర్శించాలనేది నా కోరిక..
- కాకతీయులు ఏలిన వరంగల్‌లో ప్రదర్శిస్తున్నందుకు సంతోషంగా ఉంది
- 'సాక్షి'తో అంతర్జాతీయ శాస్త్రీయ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్

హన్మకొండ కల్చరల్ : 'నటరాజ వందనం.. శివుడికి అంకితం చేసిన నృత్య ప్రదర్శన. నా తల్లి మృణాళిని సారాభాయ్ వెలువరించిన 'లవ్ సాంగ్స్ టు శివ' పుస్తకం నుంచి రూపొందించింది. సాధారణంగా పురుష దేవతల్లో ఐక్యత కోసం నాయిక అన్వేషణగా ఇది ప్రదర్శితమవుతుంది.' అని అంతర్జాతీయ శాస్త్రీయ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్ అన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్ప ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రం 'కుడా' మైదానంలో 'నటరాజ వందనం' నృత్యాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. తన నృత్య అనుభవం.. నటరాజ వందనం ప్రదర్శన తీరు, వివిధ ఆలయాల్లోని శిల్పాల్లో నృత్య భంగిమల ప్రత్యేకతల్ని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

నాకు నృత్యమంటే ప్రాణం. ఈ ఇష్టం మా అమ్మ నుంచి వచ్చినట్టుంది. అమ్మ శాస్త్రీయ నృత్యకారిణి. పుస్తకాలు రచించేది. ఆ అభిరుచి నాకు కూడా అలవడింది. కాకతీయుల కాలం నుంచి ప్రసిద్ధి చెందిన పేరిణి నృత్యం గురించి నాకు తెలుసు. 40 ఏళ్ల క్రితం కూచిపూడి గ్రామానికి చెందిన సీఆర్ ఆచార్యుల వద్ద నేను నృత్యం నేర్చుకున్నా. ప్రపంచ వ్యాప్తంగా పేరిణి నృత్య ప్రదర్శనలిచ్చా. శాస్త్రీయ సమకాలీన రచనలు సృష్టించి ప్రదర్శనలిస్తూ వస్తున్నా. 30 ఏళ్లుగా ప్రతిష్టాత్మక ఆర్ట్స్ సంస్థ 'దర్పణ అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్'కు కో-డైరెక్టర్‌గా ఉన్నా. 1989లో మహిళా శక్తిని బలోపేతం చేసే సోలో థియేట్రికల్ వర్క్‌లను ప్రదర్శించాం. సామాజిక మార్పు కోసం, మహిళా సాధికారత, పర్యావరణ స్పృహ కలిగించేలా మా ప్రదర్శనలుంటాయి. అనేక రంగస్థల నిర్మాణాల్ని రూపొందించాం. సామాజిక మార్పు, పరివర్తన కోసం కళల్ని ఉపయోగించడమే నా ధ్యేయం.

నాట్యాల్లో ప్రత్యేకం..

నాట్యాల్లో నటరాజ వందనం ప్రదర్శన ఒక ప్రత్యేకం. మా అమ్మ మృణాళిని సారాభాయ్ రచించిన 'లవ్ సాంగ్స్ టు శివ' పుస్తకం నుంచి దీన్ని కూర్పు చేశాను. పరమాత్మ కోసం ఆత్మ చేసే అన్వేషణే భరతనాట్యం. శివపార్వతుల నృత్యాన్ని చూడడానికి విశ్వం నిశ్చలంగా మారుతుంది. ఈ ప్రదర్శనను వర్ణం అని కూడా పిలుస్తారు. ఈప్రదర్శనలో నృత్యకారుడు శివుడి తాండవ నృత్య శక్తిని, గంభీరమైన రూపాన్ని చూపిస్తాడు.

రామప్పలో ప్రదర్శించాలని కోరిక..

రామప్పలో నటరాజ నృత్య ప్రదర్శన ఇవ్వాలనేది నా కోరిక. కొన్ని కారణాల వల్ల ప్రదర్శన ఇవ్వలేకపోయా. కానీ కాకతీయులు ఏలిన వరంగల్ నగరంలో ప్రదర్శించడం సంతోషంగానే ఉంది. ఇందుకు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వారు చాలా సహకారం అందించారు. రామప్ప ఆలయంలోని శిల్పాల నృత్యభంగిమలుప్రత్యేకమైనవి. పూర్వం పురాతన దేవాలయాల్లోనే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరిగేవి. అప్పటి వాళ్లు కళాపిపాసులు. అందుకేనేమో నృత్య ప్రదర్శనలను వివిధ నృత్య భంగిమల్లో శిల్పాలుగా రూపొందించారు. చరిత్రను, పురాతన దేవాలయాలను కాపాడుకోవాలి.

అభిరుచి ఉండాలి..

ఈపోటీ ప్రపంచంలో శాస్త్రీయ నృత్యం నేర్చుకోవాలంటే అభిరుచి ఉండి తీరాలి. లేదంటే మనల్ని మనం నిరూపించుకోలేం. ముందు తరాల వారు శాస్త్రీయ నృత్యాన్ని పరిపూర్ణంగా నేర్చుకోవాలి. నేర్చుకోవాలనే బలమైన కోరిక ఉండి, ఆర్థిక బలహీనత వల్ల వెనకబడేవారికి నేర్చుకునేలా అవకాశం కల్పించాలి.

మల్లికా సారాభాయ్ గురించి క్లుప్తంగా..

అంతరిక్ష శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్, శాస్త్రీయ నృత్యకారిణి మృణాళిని సారాభాయ్ దంపతుల కుమార్తె మల్లికా సారాభాయ్. 1954 మే9న అహ్మదాబాద్‌లో జన్మించారు. చిన్నతనంలోనే నృత్యం నేర్చుకున్నారు. 15 ఏళ్ల వయస్సులో సినీ నటిగా పేరు తెచ్చుకున్నారు. 18 ఏళ్ల వయస్సులో భరతనాట్యం, కూచిపూడి శాస్త్రీయ నృత్యంలో అసాధారణమైన యువనర్తకిగా గుర్తింపు పొందారు. నాటక, నృత్యరంగంలో చేసిన కృషికిగానూ గుజరాత్ ప్రభుత్వం ఆమెకు గౌరవ్ పురస్కార్ అందించింది. 2010లో భారత ప్రభుత్వంచే పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు.



సాక్షితో మాట్లాడుతున్న మల్లికా సారాభాయ్



అలరించిన నటరాజ వందనం

- శిష్యబృందంతో ప్రదర్శించిన పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్
- తిలకించిన ప్రముఖులు, నగరప్రజలు
- కళాకారులకు సన్మానం

- వివరాలు 8లో

- హన్మకొండ కల్చరల్

నటరాజ వందనం నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారిణి మల్లికా సారాభాయ్, శిష్యబృందం

'రియల్' దందాపై కొరడా

- భూమి అడిగినా ఇవ్వలేదని తప్పుడు పత్రాలతో ఆక్రమణకు యత్నం
- అధికార కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌తోపాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన హనుమకొండ పోలీసులు
- కోర్టులో హాజరు.. ఖమ్మం జైలుకు తరలింపు
- ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో మరో భూదందాలో ముగ్గురు అరెస్టు
- పోలీస్ కమిషనర్ రంగనాథ్ మార్కుపై సర్వత్రాచర్చ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇంతకాలం అడ్డూఅదుపులేకుండా సాగిన రియల్ దందాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ కొరడా ఝులిపించారు. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌పై హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడం, ఆ తరువాత అరెస్టు.. జైలు తరలించారు. మరో భూదందాలో ఇంతేజార్‌గంజ్ స్టేషన్ పరిధిలో ముగ్గురిని కటకటాల్లోకి నెట్టారు. దీంతో అక్రమ రియల్ ఎస్టేట్ దందాలు, కబ్జాలు, బెదిరింపులకు పాల్పడే వారిలో వణుకు పుడుతోంది. పోలీస్ కమిషనర్‌గా రంగనాథ్ బాధ్యతలు తీసుకున్న తరువాత సొంత శాఖపై దృష్టిసారించడంతోపాటు ఇతర అక్రమార్కులపై నిఘా పెట్టారు. దీంతో పోలీస్ అధికారులు సహితం ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తప్పు చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదనే సంకేతాలు ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లడం గమనార్హం.

కార్పొరేటర్‌పై అనేక ఆరోపణలు

- భూ దందాలో అరెస్టయిన శ్రీనివాస్ గతంలో హనుమకొండ చౌరస్తా సమీపంలో మాజీ కార్పొరేటర్లతో కలిసి ఖాళీ స్థలాన్ని ఆక్రమించి కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలున్నాయి.
- బ్రాహ్మణవాడలో నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ నిర్మించినట్లు తెలుస్తోంది
- ఎక్కడైనా 400 గజాల కమర్షియల్ ఖాళీస్థలం కనిపించినా డెవలప్‌మెంట్ పేరిట యజమానితో మొదట బేరసారాలు.. వినకపోతే తన మార్క్ చూపించి హస్తగతం చేసుకుంటాడని స్థానికులు చెబుతున్నారు.
- బస్టాండ్ సమీపంలోని కుడాకు చెందిన కాంప్లెక్స్‌ను ఎంతమంది పోటీ పడినా.. అధికార పార్టీ కీలకనేత కనుసన్నల్లోనే దక్కించుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి.

తప్పుడు పత్రాలతో అధికార పార్టీ కార్పొరేటర్ భూ ఆక్రమణ..

హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాకతీయ కాలనీ ఫేజ్-2 సర్వేనంబర్ 44లో ఉన్న నరాల సునీత భూమిని 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ అపార్ట్‌మెంట్ (డెవలప్‌మెంట్) కోసం అడిగారు. కానీ బాధితురాలు అందుకు ఒప్పుకోకపోవడంతో కార్పొరేటర్ 648 సర్వేనంబర్ పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి సర్వేనంబర్ 44 భూమినే 648గా సృష్టించడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాడు. బాధితురాలు అప్పటికే గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఇంటి నిర్మాణానికి అనుమతి పొంది పనులు కూడా చేపట్టారు. కానీ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ అతని డ్రైవర్ పడాల కుమారస్వామి కలిసి రాత్రికి రాత్రే ప్రహరీని కూల్చివేశారు. హద్దురాళ్లను చెరిపేసి బాధితులను 'మీ అంతు చూస్తా' అని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదుకు స్పందించిన పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. బాధితురాలిని బెదిరించిన విషయం విచారణలో సైతం రుజువైంది. దీంతోపాటు సర్వేయర్ నివేదిక ఆధారంగా కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, అతని డ్రైవర్ కుమారస్వామితోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. శనివారం హనుమకొండ రెండో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టడంతో 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో వేముల శ్రీనివాస్, కుమారస్వామిలను ఖమ్మం జైలుకు తరలించారు.

ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో మరో ముగ్గురు అరెస్టు..

ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేశాయిపేటకు చెందిన సర్వేనంబర్ 901/బీలోని భూమిని ఆక్రమణకు ప్రయత్నించిన పొక్కుల చిరంజీవిరావు, గోడాసి అశ్విన్‌కుమార్, సురేజ్ రమేష్‌లను స్థానిక పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇదే కేసులో సంబంధం ఉన్న బొమ్మకంటి శ్రీనివాస్, మునుగంటి రమేష్‌లు పరారీలో ఉన్నారు. ఈ సంఘటనలో నిందితులు తప్పుడు పత్రాలను సృష్టించడంతోపాటు ప్రభుత్వం సూచించిన ధరల కన్న తక్కువకు చూపించి ఎలాంటి లావాదేవీలు జరగకున్నా జరిగినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. ఆ భూమిని తాము కొనుగోలు చేసినట్లు అసలు యజమానులను బెదిరించారు. బాధితులు ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయి విచారణ చేసి నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

అద్వితీయంగా యూత్‌ఫెస్ట్-23



మాట్లాడుతున్న కల్నల్ దేవీందర్‌సింగ్ రావత్



చాక్‌పీస్‌తో పేయింటింగ్ వేస్తున్న విద్యార్థినులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో జరుగుతున్న యూత్ ఫెస్ట్-23 రెండవ రోజు శనివారం ఆకట్టుకుంది. స్టూడెంట్ కౌన్సిల్ అండ్ ఫిట్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ రన్, నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో క్లాష్ ఆఫ్ ప్లాన్స్, క్లిక్ టు ద మూమెంట్, డెక్లమేషన్, సైన్స్ అండ్ హాబీస్ క్లబ్ ఆధ్వర్యంలో చాకీ స్క్రిబిల్, ఫోటో గ్రఫీ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటో క్విజ్, అనివెల్, అస్ట్రోనమీ క్లబ్ వారు పెబిల్ పేయింటింగ్, పేయిట్రాటిక్ క్లబ్ వారు సెమినార్ యూత్ ఫర్ ఆర్మీ, సినీ హీరో సుహాస్‌తో విద్యార్థుల చిట్‌చాట్, స్పీకింగ్ షాడోస్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గులక రాళ్లపై అందమైన ఆకృతులను ఆవిష్కరించారు. చాక్‌పీస్‌లతో వివిధ రకాల రూపాలను రూపొందించారు. కళాకారుడు ప్రహ్లాద్ ఆచార్య షాడో స్పీకింగ్ పేరిట నిర్వహించిన కార్యక్రమం అలరించింది. యూత్ ఇన్ టూ ఆర్మీ పేరిట నిర్వహించిన సెమినార్‌లో కల్నల్ దేవీందర్‌సింగ్ రావత్ మాట్లాడుతూ యువత దేశ రక్షణకు ఆర్మీలో చేరాలని కోరారు.

నేటితో యూత్‌ఫెస్ట్ ముగింపు...


మూడు రోజుల యూత్‌ఫెస్ట్-23 ఆదివారంతో ముగియనుంది. చివరి రోజు ఎకో సైక్లింగ్, మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపులతో పాటు రాత్రి స్వేర్‌క్వేక్ జరగనున్నాయి.


వాట్సప్ నిట్..

- విద్యార్థులతో సినీ హీరో సుహాస్ చిట్‌చాట్


- వివరాలు 10లో

మృతులు బైరి రాము, కొంపెల్లి శివకోటి, ఓదెల కల్యాణ్, భాషబత్తిని అరవింద్ (ఫైల్)









కూలిన కలల సౌధం

బతుకుపోరులో ప్రాణాలు కోల్పోయిన యువకులు

- పెద్దదిక్కు కోల్పోయి కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు
- ఇల్లందు ఘటనలో కమలాపూర్, నర్సంపేటవాసులు నలుగురు దుర్మరణం
- స్వగ్రామాలకు చేరిన మృతదేహాలు.. విషాదఛాయలు



ఫొటోగ్రఫీ వారి వృత్తి. అనుకున్న రంగంలోరాణించి పేరు సంపాదించాలనుకున్న వారి కలలు నెరవేరకుండానే అనంతలోకాలకు చేరుకున్నారు. ఇల్లెందు మండలం కోటిలింగాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురిని బలి తీసుకోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. నలుగురి మృతదేహాలు శనివారం వారి స్వగ్రామాలకు చేరుకున్నాయి. 'తిరిగి వస్తానని చెప్పి వెళ్లి... కానరాని లోకాలకు వెళ్లారా' అంటూ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

- నర్సంపేట రూరల్/కమలాపూర్/ఇల్లెందు రూరల్

- వివరాలు 8లో

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

మన ఊరు-మన బడి సమీక్షలో వరంగల్ కలెక్టర్ గోపి

కరీమాబాద్: పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని వరంగల్ కలెక్టర్ గోపి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ గోపి మాట్లాడుతూ.. టెండర్స్, అగ్రిమెంట్స్ అంటూ కాలయాపన చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిలో పనులు సరిగ్గా జరగకపోవడానికి కారణాలేంటని ప్రశ్నించారు. సమావేశానికి హాజరు కాని వారికి నోటీసులు జారీ చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకాడే, శ్రీవత్స, డీఈఓ వాసంతి, డీపీఓ కల్పన, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్ని పరిశీలించాలి

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న పనుల్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ గోపి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్, సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడె, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

గణతంత్ర వేడుకల్ని విజయవంతం చేయాలి

వరంగల్ కలెక్టరేట్‌లో శనివారం జనవరి 26 వేడుకలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణ కలెక్టర్ కార్యాలయం లేదా వరంగల్ ఖుష్‌మహల్‌లో జరిగే అవకాశమున్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గోపి ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకాడే, శ్రీవత్స, డీసీపీ వెంకటలక్ష్మి, ఆర్డీఓ మహేందర్‌జీ, డీఆర్డీఓ సంపత్‌రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' డాటా రోజూ నమోదు చేయాలి

హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

హన్మకొండ అర్బన్: కంటివెలుగు కార్యక్రమ డాటాను రోజూ ఎంట్రీ చేయాలని, ప్రోగ్రాం అధికారులు, ప్రత్యేక అధికారులు శిబిరాలు సందర్శించాలని హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ అన్నారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంటి వెలుగు కార్యక్రమాన్ని సమీక్షించారు. జిల్లానుంచి వీసీకి హాజరైన కలెక్టర్ కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. కంటి వెలుగు విధుల్లో ఉన్న అధికారులు పర్యటించాలన్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డీఆర్‌డీఓ శ్రీనివాసకుమార్ తదితరులు ఉన్నారు.

వరంగల్ కలెక్టరేట్ నుంచి..

కంటి వెలుగు వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్‌నుంచి కలెక్టర్ గోపి, అడిషనల్ కలెక్టర్ తానాజీ పాల్గొన్నారు. శిబిరాలను పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు.

విద్యకు పది శాతం నిధులు కేటాయించాలి

- వైద్యానికి 6 శాతం కేటాయింపులుండాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి బడ్జెట్‌లో నిధుల కోత పెడుతుందని, రాబోయే బడ్జెట్‌లో విద్యకు 10శాతం నిధులు, వైద్యానికి 6 శాతం నిధులు కేటాయించాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా, వైద్యానికి నిధులు తగ్గిస్తుందన్నారు. గత బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.64శాతం నిధులు, ఆయుష్మాన్ భారత్‌కు 2.1శాతం నిధులు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులపై ఫీజుల భారం మోపుతున్నారని ఆరోపించారు. ఆదివారం వరకు సంతకాలు సేకరించి 23న ప్రధానమంత్రికి కొరియర్ ద్వారా పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీధరకుమార్‌లోథ్, గడ్డం కృష్ణ, ఆర్‌డీ ప్రసాద్, అనిల్‌కుమార్, మధుర్‌రావు, బ్రహ్మయ్య, రాజేశ్వరి, స్వప్న, వందన, వాణి, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సమస్యల పరిష్కారంలో సర్కార్ జాప్యం

రాష్ట్రంలోని ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ప్రతీ అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు ఎమ్మెల్సీని కలిశారు. 15–20 ఏళ్లుగా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్నామని వేతనం 30 శాతం పెంచాలని, కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఎత్తివేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నర్సిరెడ్డి మాట్లాడుతూ కామన్ రిక్రూట్‌మంట్ బోర్డును గవర్నర్ ఇప్పటి వరకు ఆమోదించలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, ఒప్పంద అధ్యాపకుల సంఘం బాధ్యులు డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ కరుణాకర్‌రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్, డాక్టర్ ఫిరోజ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కూలిన కలల సౌధం

బతుకుపోరులో ప్రాణాలు కోల్పోయిన యువకులు

- కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు
- స్వస్థలాలకు మృతదేహాలు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



రాము మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



కల్యాణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వారంతా 20 – 35 ఏళ్ల మధ్య వయసున్న యువకులు.. పనిచేస్తేనే బతుకు బండిని లాగే నిరుపేద కుటుంబాలు.. పొట్టకూటి కోసం ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని వృత్తిలో ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారు. ఇంతలోనే విధి వక్రీకరించి వారి కలల సౌధాన్ని కూల్చివేసింది. రోడ్డు ప్రమాద రూపంలో కుటుంబాలను వీధి పాలు చేసింది. చిన్న వయసులోనే కొడుకులు దూరమైన తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన యువతుల ఆర్తనాదాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కోటిలింగాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురిని బలి తీసుకోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు శనివారం తెల్లవారుజామునే ఇల్లెందు ఆస్పత్రికి చేరుకున్న వారి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం అనంతరం నలుగురి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురాగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తరలివచ్చి కడసారి చూశారు.

– ఇల్లెందు రూరల్/నర్సంపేట రూరల్/కమలాపూర్

ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలకే..

హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన భాషబత్తిని శ్రీనివాస్– రాజమణి దంపతుల కుమారుడు అరవింద్ (21) ఇంటర్ వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రేమించిన యువతిని పెద్దల అంగీకారంతో గత డిసెంబర్ 17న అరవింద్ పెళ్లి చేసుకున్నాడు. జీవితంలో స్థిరపడాలనే ఆకాంక్షతో ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించి హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. మిత్రులతో కలిసి ఫొటో షూట్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం మింగేసింది. ఒక్కగానొక్క కుమారుడిని గారాబంగా పెంచామని, కోరుకున్న యువతితో పెళ్లి చేయగా.. ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని తల్లిదండ్రులు విలపించిన తీరు కలచివేసింది. ఇక వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన కొంపెల్లి రాంబాబు– జయల ఏకైక కుమారుడు శివకోటి (31). ఆరేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం గ్రామానికి చెందిన కళ్యాణిని ప్రేమ వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫొటోగ్రఫీలో మెరుగైన జీవనం కోసం వరంగల్‌కు మకాం మార్చాడు. అద్దె ఇంట్లో ఉంటున్న ఆయన గతేడాది జాతీయ స్థాయి అవార్డు అందుకున్నాడు. గతేడాది శివకోటి తల్లి కేన్సర్‌తో మృతి చెందింది. తండ్రి రాంబాబు కరెంట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెడ్డింగ్ షూట్ కోసం బయలుదేరి రోడ్డు ప్రమాదంలో శివకోటి ప్రాణాలు కోల్పోగా భార్య, పిల్లలు, తండ్రి దిక్కులేని వారయ్యారు. మృతుల్లో మరో వ్యక్తి హనుమకొండ జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన బైరి రాము(32) కూడా ఫొటోగ్రఫీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. పదిహేనేళ్లుగా ఇదే రంగంలో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య రజిని, పాప, బాబు ఉండగా కుటుంబంతో సహా వరంగల్‌లో ఉంటున్నాడు. ఉన్నంతలో జీవనం సాఫీగా సాగుతున్న సమయాన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. రాముకు తల్లిదండ్రులు సదానందం, శ్రీలత ఉన్నారు.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న క్రాంతి రణధీర్..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన అబ్బునాపురం భాస్కర్–రజిత దంపతుల కుమారుడు క్రాంతి రణధీర్(22) తన స్నేహితుడైన కళ్యాణ్ వద్ద కలిసి ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించాడు. వృత్తిలో మెళకువలు నేర్చుకునేందుకు శుక్రవారం మిత్రుడితో కలిసి ఫొటో షూట్‌కు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను శనివారం ఉదయం ఖమ్మం ఆస్పత్రి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

అంత్యక్రియలు పూర్తి..

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఓదెల కల్యాణ్, భాషబత్తిని అరవింద్, కొంపెల్లి శివకోటి, బైరి రాము మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చారు. బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కడసారి చూసి కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య మృతుల అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఆవిరైన చిన్నమ్మ ఆశలు..



వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన ఓదెల కళ్యాణ్ (28) చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అదే సమయాన భర్తను కోల్పోయిన కళ్యాణ్ చిన్నమ్మ ఓదెల వనమాల ఆయనను దత్తత తీసుకుంది. ఇంటర్ వరకు చదువుకున్న కళ్యాణ్ ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకున్నాడు. 2017లో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన మౌనికతో వివాహం జరిగింది. పెళ్లయ్యాక వరంగల్ మకాం మార్చాడు. వీరికి రెండేళ్ల కూతురు అంజిత ఉంది. భార్య, కూతురు, చిన్నమ్మతో కలిసి సంతోషంగా ఉంటున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆయనను బలితీసుకుంది. దీంతో పెద్దదిక్కు కోల్పోయిన చిన్నమ్మ వనమాల, భర్త దూరమైన మౌనిక, తండ్రికి ఏమైందో తెలియక చిన్నారి అంజిత రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.







విలపిస్తున్న అరవింద్ కుటుంబ సభ్యులు, భార్యను ఓదారుస్తున్న మృతుడు అరవింద్ తండ్రి శ్రీనివాస్, ఇల్లందు ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కళ్యాణ్ కుటుంబీకులు







శివకోటి కుమారులు అఖిల్, అక్షిత్.. కళ్యాణ్ కుమార్తె

కళలతో సమాజ చైతన్యం

- ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయ్

హన్మకొండ: నాట్యం కేవలం కళే కాదని సమాజాన్ని చైతన్యం చేసే సాధనమని ప్రముఖ భారత నృత్యకారిణి, పద్మభూషన్ మల్లికా సారాభాయ్ అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కళలకు రాజకీయం ఆపాదించడం ఎంత వరకు సమంజసమని, భక్తి ఆరాధనతో చేసే ఉత్సవాలను రామప్పలో నిర్వహించకుండా అభ్యంతరాలు చెప్పడం సరి కాదన్నారు. రామప్పలో ఉత్సవాలు నిర్వహించి శివుడికి ప్రీతిపాత్రమైన నృత్య ప్రదర్శన ఇవ్వాలని అనుకున్నానని, అక్కడ నిర్వహిస్తే ఎంతో సంతోషించే దానినని, రాజకీయాలు ముడిపెట్టి అనుమతివ్వకపోవడం బాధాకరమన్నారు. దీంతె వరంగల్‌లో ఉత్సవాల నిర్వహణకు కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఏర్పాట్లు చేసిందన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ట్రస్టీ బి.వి.పాపారావు మాట్లాడుతూ రాజకీయంగా విభిన్న అభిప్రాయాలు ఉండొచ్చు.. రామప్పకు భక్తి భావంతో వెళ్తాం.. అయితే దానిని రాజకీయంగా చూడడం సరి కాదన్నారు. తాము 14 ఏళ్లు కష్టపడి రామప్పకు యునెస్కో గుర్తింపు సాధించామన్నారు. రామప్ప కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నందునే రాజకీయ కోణంలో మల్లికా సారాభాయ్ ఫెస్టివల్‌కు అనుమతి ఇవ్వలేదన్నారు. ఇక్కడ కేసీఆర్ సీఎంగా ఉన్నారని.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిని ఇతరులకు ఇవ్వబోమని ఆయన అనడం లేదుగా అన్నారు. రాజకీయ ఇబ్బందులు వస్తాయనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రామప్పలో ఉత్సవాల నిర్వహణకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని వారసత్వ కట్టడాలను రాష్ట్ర పరిధిలోని తీసుకొచ్చేందుకు పోరాడుతామన్నారు.



అలరించిన నటరాజ వందనం

హన్మకొండ కల్చరల్ : రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో ప్రకటించిన సందర్భంగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమకొండ బాలసముద్రం కుడా మైదానంలో రామప్ప ఫెస్టివల్ వైభవంగా జరిగింది. ముందుగా ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ బీపీ పాపారావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వక్తలు మాట్లాడారు. అనంతరం ప్రముఖ కూచిపూడి, భారత నాట్య కళాకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ మల్లికా సారాభాయ్ శిష్యబృందంతో ప్రదర్శించిన నటరాజ వందనం నృత్య ప్రదర్శన అలరించింది. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, కలెక్టర్లు రాజీవ్ గాంధీ హన్మంతు, గోపి, నగర పోలీస్ కమీషనర్ రంగనాథ్, వరంగల్ పూర్వ కలెక్టర్ బీపీ ఆచార్య, ములుగు ఎస్పీ విక్రమ్‌సంగ్రాం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీలు శ్రీధర్‌రావు, పాండురంగారావు, బూర విద్యాసాగర్‌గౌడ్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సన్మానించారు. కార్యక్రమానికి వాఖ్యాతగా మగ్దూం వ్యవహరించారు. ఉమ్మడి జిల్లాల నుండి అధికసంఖ్యలో నృత్యకళాకారులు, నృత్య గురువులు వారి శిష్యబృందంతో పాల్గొన్నారు. హన్మకొండ ఏసీపీ షకూర్, ఏసీపీ కిరణ్‌కుమార్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.





నృత్య ప్రదర్శన ఇస్తున్న మల్లికా సారాభాయ్ శిష్య బృందం





నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, కలెక్టర్లు, పోలీస్ అధికారులు

చికిత్స పొందుతున్న యువరైతు మృతి



శ్రీను (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ యువరైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారు బోడతండాలో శనివారం జరిగింది. రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను(35)కు 1.20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఎకరం భూమిలో మిర్చి, 20 గుంటల్లో భూమిలో వరి సాగు చేశాడు. మిర్చికి అధిక పెట్టుబడి పెట్టినా సరైన దిగుబడి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను ఈ నెల 7న మిర్చి తోట వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. గమనించిన శ్రీను భార్య సరోజ చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా ఉండడంతో రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి ఇస్లావత్ బోజ్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి పర్యటన

హన్మకొండ: కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రి బీఎల్.వర్మ ఆదివారం హనుమకొండ, ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి పర్యటన వివరాలను బీజేపీ హనుమకొండ జిల్లా శాఖ విడుదల చేసింది. మంత్రి 22న ఉదయం 7.15 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ నుంచి భద్రకాళి బండ్‌కు చేరుకుని వాకర్స్‌ను కలుస్తారు. 9 గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుని అల్పాహారం స్వీకరిస్తారు. ఉదయం 10 గంటలకు పద్మాక్షి దేవాలయానికి చేరుకుంటారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు. ఇక్కడి నుంచి 11.15కు ఆత్మకూరుకు చేరుకుని రైతులతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ములుగు నియోజకవర్గంలోని పస్రాకు చేరుకుంటారు. ఇక్కడ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి స్వగృహంలో మధ్యాహ్నం భోజనం చేస్తారు. 3 గంటలకు పస్రా పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటలకు తాడ్వాయిలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారు. ఇక్కడి నుంచి రాత్రి 7 గంటలకు పినపాక నియోజకవర్గం సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌజ్‌కు చేరుకుంటారు. ఇక్కడ బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.

పాసవుతానో.. లేదోనని..

- పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



ఎల్కతుర్తి: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఇంటి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శలగాని రమేష్ ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. వీరికి హాసిని(15)తోపాటు కుమారుడు ఉన్నాడు. హాసిని హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట వద్ద గల ఐపీఎస్ స్కూల్లో పదో తరగతి చదువుతుంది. యూనిట్ టెస్టుల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని.. వార్షిక పరీక్షల్లో పాస్ అవుతానో లేదోనని మనస్తాపం చెందిన హాసిని ఇంటి వద్ద రేకుల షెడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

నల్లబెల్లి: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లికి చెందిన ఎండి బాబర్(47) నర్సంపేట డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగిశాక బైక్‌పై నర్సంపేట నుంచి స్వగ్రామం వస్తున్నాడు. నల్లబెల్లి క్రాస్ రోడ్డుకు రాగానే ములుగు జిల్లా మల్లంపల్లి నుంచి ఎర్రమట్టి లోడుతో వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టీఆర్ఎస్‌పై వ్యతిరేకతతోనే బీఆర్ఎస్‌గా

- కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

కాశిబుగ్గ: రాష్ట్రంలో టీఆర్ఎస్ మీద వ్యతిరేకతతోనే సీఎం కేసీఆర్ భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)గా పార్టీ పేరు మార్చారని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార సంఘాల శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ అన్నారు. శనివారం రాత్రి ఓసిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసిఆర్ టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా పేరు మార్చినంత మాత్రాన అయన సాధించేది ఏమీ లేదన్నారు. వచ్చేది బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ అని, నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి సైనికులా పనిచేయాలని సూచించారు. అయన వెంట బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, నాయకులు కల్లెం బాల్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, కుసుమ సతీష్, భాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, మంతెన ఆమరీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

యువత హాకీపై ఆసక్తిని పెంచుకోవాలి

మామునూరు: యువత హాకీపై ఆసక్తి పెంచుకోవాలని, మంచి భవిష్యత్ ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ అన్నారు. బషీర్ హుస్సేన్(అజద్) స్మారకార్థం వరంగల్ మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్(సెంట్రల్ జైల్) క్రీడామైదానంలో కోచ్ హుస్సేన్ ఆధ్వర్యంలో 21, 22 రెండు రోజుల పాటు జరుగుతున్న జిల్లా స్థాయి 5వ హాకీ టోర్నమెంట్ టోర్నీమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ భిక్షపతి, ఆరూరి విశాల్, ఇనుగాల జోగిరెడ్డి, కార్పొరేటర్లు జలగం అనిత, రంజిత్, అరుణ్, విక్టర్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం

- ఎమ్మెల్సీ బండ ప్రకాష్

కాజీపేట రూరల్: సమాజంలో యువతీ యువకుల ఆత్మరక్షణ, క్రమశిక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శనివారం కుంగ్‌ఫు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెఫరీ సెమినార్ జరిగింది. సెమినార్‌లో బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రస్తుతం బాలికలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించేందుకు ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని అన్నారు. రెఫరీ శిక్షణకు 5 రాష్ట్రాల నుంచి వచ్చిన మాస్టర్లకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, రైల్వే స్టేషన్ మేనేజర్ బి.బాలరాజు, కేఎఫ్‌డీఐ ఫౌండర్ మాస్టర్ కంటేశ్వర్, ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కార్తిక్ డీకె., వివిధ రాష్ట్రాల మాస్టర్లు పాల్గొన్నారు.



సెమినార్‌కు వచ్చిన మాస్టర్లతో ఎమ్మెల్సీ ప్రకాష్